సాక్షి
జనగామ

ఆదివారం । 22 । జనవరి । 2023



నిధులు కేటాయించాలి

కేంద్ర ప్రభుత్వం విద్యకు బడ్జెట్‌లో పదిశాతం నిధులు కేటాయించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు.

- 8లో



మెడికల్ మాఫియా లబ్ధికే..

మెడికల్ మాఫియాకు లబ్ధి చేకూర్చడానికే ఆయుష్మాన్ భారత్ పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయడం లేదని కేంద్ర సహాయ మంత్రి బీఎల్.వర్మ ఆరోపించారు. - 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
$30^0/17^0$

ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు కాస్త పెరుగుతాయి. ఆకాశం అక్కడక్కడా మేఘావృతం అవుతుంది. రాత్రి పూట చలి పెరుగుతుంది.

న్యూస్‌రీల్

'అమృత్ భారత్' రైల్వేస్టేషన్ల ఎంపిక



కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్, వరంగల్, జనగామ, మహబూబాబాద్ రైల్వేస్టేషన్లు అమృత్ భారత్ రైల్వేస్టేషన్లుగా ఎంపికైనట్లు శనివారం రైల్వే అధికారులు తెలిపారు. అమృత్ భారత్ రైల్వే స్టేషన్ల అభివృద్ధి పథకంలో భాగంగా ఉమ్మడి జిల్లాలోని నాలుగు రైల్వే స్టేషన్లను ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. టెండర్లు కూడా పిలిచినట్లు తెలిపారు. ఎంపికైన స్టేషన్లలో ప్లాట్‌ఫాంల ఆధునికీకరణ, ఇతర సౌకర్యాలు కల్పించనున్నారు.

కారోబార్ల సమస్యలు పరిష్కరించాలి

జనగామ రూరల్: గ్రామాల్లో పని చేస్తున్న కారోబార్ల సమస్యలు పరిష్కరించి ప్రత్యేక స్టేటస్ ఇవ్వాలని కారోబార్ల సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లాచారి అన్నారు. శనివారం జిల్లా కేంద్రం బతుకమ్మకుంట ఆవరణలో ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏళ్ల తరబడి గ్రామాల్లో సేవలు అందిస్తున్న కారోబార్లకు వేతనాలు పెంచడంతో పాటు మల్టీపర్పస్ విధానం అమలు చేయాలని, ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు జి.భాస్కర్, ప్రధాన కార్యదర్శి లక్ష్మారెడ్డి, రాజు, సత్యనారాయణ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి



జనగామ రూరల్: ఎన్నికల సమయంలో జిల్లాకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్.మూర్తి డిమాండ్ చేశారు. జిల్లాకు మంజూరు చేసిన మెడికల్ కళాశాలను ఈవిద్యాసంవత్సరం ప్రారంభించాలన్నారు. ఈ మేరకు శనివారం మెడికల్ కళాశాలకు కేటాయించిన స్థలాన్ని పరిశీలించిన అనంతరం మాట్లాడారు. సంక్షేమ హాస్టళ్లలో సమస్యల కారణంగా విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, వసతులు లేక చదువు మధ్యలో మానేసే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. అనతరం అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌కి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సందీప్, కార్యదర్శి ధర్మభిక్షం, వికాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



జనగామ రూరల్: టెన్త్, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని మైనార్టీ గురుకులాల రాష్ట్ర కార్యదర్శి షఫీఉల్లా అన్నారు. ఉమ్మడి వరంగల్ పర్యటనలో భాగంగా ఆయన శనివారం జిల్లా కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలను సందర్శించారు. సమస్యలు తెలుసుకుని మాట్లాడారు. విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పించి పౌష్టికాహారం అందిస్తున్నామని, సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రిన్సిపాల్ స్టాన్లీ డెజిల్, మైనార్టీ శాఖ అధికారి ఇస్మాయిల్ పాల్గొన్నారు.

సేవలకు ఐదేళ్లు



ఎంసీహెచ్‌లో ఐదేళ్ల కాలంలో జరిగిన కాన్పులు, కేసీఆర్ కిట్ల పంపిణీ వివరాలు		
ఏడాది	కాన్పులు	కేసీఆర్ కిట్లు
2018	3,522	3,080
2019	3,853	3,478
2020	4,401	3,890
2021	3,865	3,405
2022	4,636	4,123

ఎంసీహెచ్‌లో 20,277 డెలివరీలు

- 17,976 కేసీఆర్ కిట్ల పంపిణీ
- 2022లో రికార్డు స్థాయి కాన్పులు
- ఎస్ఎన్‌సీయూ సేవల్లో స్టేట్ నంబర్ వన్



జిల్లా కేంద్రంలోని చంపక్‌హిల్స్ మాతా శిశు సంరక్షణ ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్) సేవలకు నేటి(ఆదివారం)తో ఐదేళ్లు పూర్తయ్యాయి. 2017 నవంబర్ 29న నాటి వైద్యారోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా ఎంసీహెచ్ భవనం ప్రారంభించగా, 2018 జనవరి 22 నుంచి వైద్య సేవలు మొదలయ్యాయి. మొదటి డెలివరీ ప్రస్తుత మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్‌రాజు చేశారు. ఐదేళ్ల కాలంలో ఆస్పత్రి ఎంతో ప్రగతి సాధించింది. ఏడాదిలో అత్యధిక కాన్పులు.. అలాగే ఒకే రోజు 35 డెలివరీలతో స్టేట్ రికార్డు సొంతం చేసుకుంది.

జనగామ: పేదలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న తెలంగాణ ప్రభుత్వం.. సర్కారు ఆస్పత్రుల్లో సేవలను మరింత పటిష్టం చేసింది. ప్రత్యేకంగా పేద మహిళల ప్రసవాలు, శిశువులకు సంబంధించి మెరుగైన సేవలందించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసింది. జిల్లాలో జనగామ మండలం పసరమడ్ల శివారు చంపక్‌హిల్స్‌లో ఎంసీహెచ్ ఆస్పత్రి నెలకొల్పిన ప్రభుత్వం.. వైద్యులు, వైద్య సిబ్బంది, యంత్ర పరికరాలను సమకూర్చింది. ఇక్కడ మెరుగైన సేవలు అందుతుండడంతో సొంత జిల్లాతో పాటు సమీపాన ఉన్న సిద్దిపేట, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి నుంచి కూడా డెలివరీ కోసం ఇక్కడికే వస్తున్నారు.

ఐదేళ్లు.. 20,277 డెలివరీలు

ఎంసీహెచ్ సేవలు ప్రారంభమైన ఐదేళ్ల కాలంలో 20,277 కాన్పులు చేశారు. ఇప్పటి వరకు 17,976 మందికి కేసీఆర్ కిట్లు అందజేశారు. గడిచిన నాలుగేళ్లతో పోల్చితే.. 2022 సంవత్సరంలో నెలవారీ సరాసరి 386 డెలివరీలతో మొత్తం 4,636 కాన్పులు చేశారు. 24 గంటల వ్యవధిలో 35 డెలివరీలు చేసి రికార్డు సొంతం చేసుకున్నారు. ఎస్ఎన్‌సీయూ (చిల్డ్రన్స్ ప్రత్యేక వార్డు) సేవల విషయానికి వస్తే చిన్న జిల్లాల్లో రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలువగా, ఓవరాల్ సేవల పరంగా 3వ స్థానం దక్కించుకుంది. కాగా 2022–23లో 70శాతం సాధారణ డెలివరీలు, 30శాతం సిజేరియన్ కాన్పులు చేశారు. ఆరోగ్య శ్రీ పథకం ద్వారా 921 మందికి వైద్య సేవలు అందించారు. జిల్లాకు మెడికల్ కళాశాల మంజూరు కావడంతో.. డిస్ట్రిక్ట్, ఎంసీహెచ్ ఆస్పత్రుల పేర్లు.. ప్రభుత్వ మెడికల్ కళాశాల, జనరల్ ఆస్పత్రిగా మారాయి. అందుకు తగినట్లుగా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇదే స్ఫూర్తితో ముందుకు వెళ్తాం..



జనగామ ఎంసీహెచ్ కాన్పులతో పాటు ఎస్ఎన్‌సీయూ సేవల్లో స్టేట్ టాప్‌లో ఉండడం గర్వంగా ఉంది. ప్రతి నెలా 250 డెలివరీలు టార్గెట్ ఉండగా.. 400 దాటుతున్నాయి. ఒకేరోజు రికార్డు స్థాయిలో 35 కాన్పులు చేయగా, మంత్రి హరీశ్‌రావు ప్రత్యేకంగా అభినందించారు. మన జిల్లాతో పాటు పొరుగు జిల్లాలకు చెందిన వారు సైతం ప్రసవానికి ఇక్కడికే వస్తున్నారు. కలెక్టర్ చొరవతో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశాం. 24 గంటలు సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈ నూతన సంవత్సరంలోనూ ఇదే స్ఫూర్తితో ముందుకు వెళ్తాం.

- డాక్టర్ సుగుణాకర్‌రాజు, మెడికల్ సూపరింటెండెంట్

నటరాజ వందనం.. శివుడికే అంకితం



- అమ్మ రాసిన పుస్తకంలోంచి నృత్య రూపకం..
- రామప్పలో ప్రదర్శించాలనేది నా కోరిక..
- కాకతీయులు ఏలిన వరంగల్‌లో ప్రదర్శిస్తున్నందుకు సంతోషంగా ఉంది
- 'సాక్షి'తో అంతర్జాతీయ శాస్త్రీయ నృత్యకారిణి, పద్మభూషణ్ అవార్డు గ్రహీత మల్లికా సారాభాయ్

హన్మకొండ కల్చరల్ : 'నటరాజ వందనం.. శివుడికి అంకితం చేసిన నృత్య ప్రదర్శన. నా తల్లి మృణాళిని సారాభాయ్ వెలువరించిన 'లవ్ సాంగ్స్ టు శివ' పుస్తకం నుంచి రూపొందించింది. సాధారణంగా పురుష దేవతల్లో ఐక్యత కోసం నాయిక అన్వేషణగా ఇది ప్రదర్శితమవుతుంది.' అని అంతర్జాతీయ శాస్త్రీయ నృత్యకారిణి, పద్మభూషణ్ అవార్డు గ్రహీత మల్లికా సారాభాయ్ అన్నారు. కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రామప్ప ఉత్సవాల్లో భాగంగా శనివారం హనుమకొండ బాలసముద్రం 'కుడా' మైదానంలో 'నటరాజ వందనం' నృత్యాన్ని ప్రదర్శించారు. ఈసందర్భంగా ఆమె 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. తన నృత్య అనుభవం.. నటరాజ వందనం ప్రదర్శన తీరు, వివిధ ఆలయాల్లోని శిల్పాల్లో నృత్య భంగిమల ప్రత్యేకతల్ని వివరించారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే..

నాకు నృత్యమంటే ప్రాణం. ఈ ఇష్టం మా అమ్మ నుంచి వచ్చినట్టుంది. అమ్మ శాస్త్రీయ నృత్యకారిణి. పుస్తకాలు రచించేది. ఆ అభిరుచి నాకు కూడా అలవడింది. కాకతీయుల కాలం నుంచి ప్రసిద్ధి చెందిన పేరిణి నృత్యం గురించి నాకు తెలుసు. 40ఏళ్ల క్రితం కూచిపూడి గ్రామానికి చెందిన సీఆర్ ఆచార్యుల వద్ద నేను నృత్యం నేర్చుకున్నా. ప్రపంచ వ్యాప్తంగా పేరిణి నృత్య ప్రదర్శనలిచ్చా. శాస్త్రీయ సమకాలీన రచనలు సృష్టించి ప్రదర్శనలిస్తూ వస్తున్నా. 30 ఏళ్లుగా ప్రతిష్టాత్మక ఆర్ట్స్ సంస్థ 'దర్పణ అకాడమీ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్'కు కో–డైరెక్టర్‌గా ఉన్నా. 1989లో మహిళా శక్తిని బలోపేతం చేసే సోలో థియేట్రికల్ వర్క్‌లను ప్రదర్శించాం. సామాజిక మార్పు కోసం, మహిళా సాధికారత, పర్యావరణ స్పృహ కలిగించేలా మా ప్రదర్శనలుంటాయి. అనేక రంగస్థల నిర్మాణాల్ని రూపొందించాం. సామాజిక మార్పు, పరివర్తన కోసం కళల్ని ఉపయోగించడమే నా ధ్యేయం.

నాట్యాల్లో ప్రత్యేకం..

నాట్యాల్లో నటరాజ వందనం ప్రదర్శన ఒక ప్రత్యేకం. మా అమ్మ మృణాళిని సారాభాయ్ రచించిన 'లవ్ సాంగ్స్ టు శివ' పుస్తకం నుంచి దీన్ని కూర్పు చేశాను. పరమాత్మ కోసం ఆత్మ చేసే అన్వేషణే భరతనాట్యం. శివపార్వతుల నృత్యాన్ని చూడడానికి విశ్వం నిశ్చలంగా మారుతుంది. ఈ ప్రదర్శనను వర్ణం అని కూడా పిలుస్తారు. ఈప్రదర్శనలో నృత్యకారుడు శివుడి తాండవ నృత్య శక్తిని, గంభీరమైన రూపాన్ని చూపిస్తాడు.

మల్లికా సారాభాయ్ గురించి..

అంతరిక్ష శాస్త్రవేత్త విక్రమ్ సారాభాయ్, శాస్త్రీయ నృత్యకారిణి మృణాళిని సారాభాయ్ దంపతుల కుమార్తె మల్లికా సారాభాయ్. 1954 మే 9న అహ్మదాబాద్‌లో జన్మించారు. చిన్నతనంలోనే నృత్యం నేర్చుకున్నారు. 15 ఏళ్ల వయసులో సినీ నటిగా పేరు తెచ్చుకున్నారు. 18 ఏళ్ల వయసులో భరతనాట్యం, కూచిపూడి శాస్త్రీయ నృత్యంలో అసాధారణ యువనర్తకిగా గుర్తింపు పొందారు. నాటక, నృత్యరంగంలో చేసిన కృషికి గుజరాత్ ప్రభుత్వం ఆమెకు గౌరవ్ పురస్కార్ అందించింది. 2010లో భారత ప్రభుత్వం నుంచి పద్మభూషణ్ అవార్డు అందుకున్నారు.

రామప్పలో ప్రదర్శించాలని కోరిక..

రామప్పలో నటరాజ నృత్య ప్రదర్శన ఇవ్వాలనేది నా కోరిక. కొన్ని కారణాల వల్ల ప్రదర్శన ఇవ్వలేకపోయా. కానీ కాకతీయులు ఏలిన వరంగల్ నగరంలో ప్రదర్శించడం కూడా సంతోషంగానే ఉంది. ఇందుకు కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ వారు చాలా సహకారం అందించారు. రామప్ప ఆలయంలోని శిల్పాల నృత్యభంగిమలు ఎంతో ప్రత్యేకమైనవి. పూర్వం పురాతన దేవాలయాల్లోనే శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు జరిగేవి. అప్పటి వాళ్లు కళాపిపాసులు. అందుకేనేమో నృత్య ప్రదర్శనలను వివిధ నృత్య భంగిమల్లో శిల్పాలుగా రూపొందించారు. చరిత్రను, పురాతన దేవాలయాలను కాపాడుకోవాలి.

అభిరుచి ఉండాలి..

ఈపోటీ ప్రపంచంలో శాస్త్రీయ నృత్యం నేర్చుకోవాలంటే అభిరుచి ఉండి తీరాలి. లేదంటే మనల్ని మనం నిరూపించుకోలేం. ముందు తరాల వారు శాస్త్రీయ నృత్యాన్ని పరిపూర్ణంగా నేర్చుకోవాలి. నేర్చుకోవాలనే బలమైన కోరిక ఉండి, ఆర్థిక బలహీనత వల్ల వెనుకబడేవారికి నేర్చుకునేలా అవకాశం కల్పించాలి. మన ప్రభుత్వం శాస్త్రీయ కళలకు నిధులివ్వట్లేదు. ప్రభుత్వం నుంచి కూడా ప్రోత్సాహం అవసరం.

డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే సంక్షేమం

- రాష్ట్రంలో అవినీతి పాలన
- కేంద్ర సహాయ మంత్రి బీఎల్.వర్మ



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి బీఎల్.వర్మ

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్రంలో అవినీతి, కుటుంబ పాలన సాగుతోంది.. కేంద్రంలో రాష్ట్రంలో బీజేపీ (డబుల్ ఇంజ న్ సర్కార్) అధికారంలోకి వస్తేనే సంక్షేమ పథకాలు ఇంటింటికీ అందుతాయని కేంద్ర ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి, సహకార శాఖ సహాయ మంత్రి బీఎల్.వర్మ అన్నారు. పార్టీ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా శనివారం పాంనూర్‌లో పీఎం ఆవాస్ యోజన, ఉజ్వల యోజన లబ్ధిదారులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పాలనలో ప్రధాని నరేంద్రమోదీ ప్రపంచంలోనే నంబర్‌వన్‌గా నిలిచారని, గ్రామీణ ప్రాంత పేదలు, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి అనేక పథకాలు తీసుకొచ్చారని చెప్పారు. దేశ వ్యాప్తంగా 3.60 కోట్ల ఇళ్లు నిర్మించి ఇచ్చారని, వాటికి ఉచితంగా విద్యుత్, ఉజ్వల గ్యాస్ కనెక్షన్లతోపాటు మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టారని పేర్కొన్నారు. ఒక్కో కుటుంబానికి రూ.5లక్షల వరకు ఉచిత వైద్యం కోసం ఆయుష్మాన్‌భవ కార్డులు అందజేసినట్లు తెలిపారు. అయితే కేంద్ర ప్రభుత్వం అందించే పథకాలను సీఎం కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణలో అడ్డుకుంటోందని, పీఎం ఆవాస్ యోజన పథకాన్ని డబుల్ బెడ్రూం స్కీంగా చెప్పుకుంటూ అందులో అవినీతికి పాల్పడుతోందని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలంటే తెలంగాణలో బీజేపీని ఆశీర్వదించాలని కోరారు. కేంద్రమంత్రి హిందీలో ప్రసంగించగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి తెలుగులోకి అనువదించారు. పార్టీ నియోజకవర్గ కన్వీనర్ ఐలోని అంజిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ గుండె విజయరామారావు, జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఉమారాణి, రాష్ట్ర నాయకులు బొజ్జపల్లి సుభాష్, ఇనుగాల యుగేందర్‌రెడ్డి, తాళ్లపెల్లి కుమార్, మిట్టపల్లి శ్రీనివాస్, వేముల అశోక్, శివరాజ్‌యాదవ్, గట్టు కృష్ణ, చిలుక విజయరావు, పూండ్రు నవీన్‌రెడ్డి, రడపాక ప్రదీప్, కుమ్మం సతీష్, సీహెచ్.నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర సహాయ మంత్రికి స్వాగతం

జనగామ: కేంద్ర సహాయ మంత్రి బీఎల్ వర్మకు జనగామ పట్టణంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర, జిల్లా నాయకులు గుజ్జుల ప్రేముందర్‌రెడ్డి, గాడిపెల్లి ప్రేమలతారెడ్డి, కౌన్సిలర్లు మహంకాళి హరిశ్చంద్రగుప్త, బి.శ్రీనివాస్, సొడ రమేష్, ఉడుగు రమేష్, శివరాజ్, పెద్దోజు జగదీష్, శానబోయిన మహిపాల్ తదితరులు ఆయనను సత్కరించారు. అనంతరం శర్మ ఘన్‌పూర్‌కు బయలుదేరారు.

వలంటీర్లు నిస్వార్థంగా సేవలందించాలి : జడ్జి శైలజ



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి శైలజ

జనగామ రూరల్: పారా లీగల్ వలంటీర్లు ప్రజలకు నిస్వార్థంగా సేవలందించాలని జిల్లా జడ్జి కె.శైలజ అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలో పారా లీగల్ వలంటీర్లకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వలంటీర్లు న్యాయసేవా సంస్థకు.. ప్రజలకు మధ్య వారధిగా పని చేయాలని, వారికి త్వరలో ఐడీ కార్డులు అందజేస్తామని చెప్పారు. అనంతరం సబ్‌జైలు, బాలసదనంను సందర్శించి పలు సూచనలు చేశారు. పెంబర్తి గ్రామ పంచాయతీ కార్యాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతాప్రమాణాలు పాటించాలి

- 'కంటి వెలుగు' శిబిరాలను క్వాలిటీ కంట్రోల్ టీంలు సందర్శించాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ శాంతికుమారి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్, ఇతర శాఖల అధికారులు

జనగామ రూరల్: కంటి వెలుగు శిబిరాలు పకడ్బందీగా నిర్వహించి.. పరీక్షల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ శ్వేత, ఉన్నతాధికారులతో కలిసి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. కంటి వెలుగు క్యాంపులు విజయవంతంగా నిర్వహిస్తున్నందుకు అభినందించారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు నిర్వహించే క్యాంపుల వివరాల సమాచారాన్ని రోజూ ఉదయం 9.15 వరకు అప్‌డేట్ చేయాలని సూచించారు. క్వాలిటీ కంట్రోల్ బృందాలు పర్యటించి శిబిరాలను మరింత మెరుగ్గా నిర్వహించేలా చూడాలన్నారు. రాబోయే 15 రోజుల్లో బఫర్ బృందాలతో జర్నలిస్టులు, ఉద్యోగులు, పోలీసులు, కోర్టు సిబ్బంది వివిధ వర్గాల వారికి ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని, ఇందుకు అవసరమైన షెడ్యూల్ తయారు చేసుకోవాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ శివలింగయ్య మాట్లాడుతూ.. అధికారులు సమన్వయంతో పని చేయాలని, కంటి వెలుగు శిబిరాల్లో అద్దాలు, మందులు అందుబాటులో ఉండేలా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, వైద్యాధికారి మహేందర్, ఆర్డీఓలు మధుమోహన్, కృష్ణవేణి, డీఆర్డీఓ రాంరెడ్డి, ప్రోగ్రాం అధికారి భాస్కర్, అశోక్, సుధీర్, రాజశేఖర్, డీఎల్‌పీఓ పార్థసారధి, మున్సిపల్ కమిషనర్ రజిత పాల్గొన్నారు.

కేంద్రం నిధులు ఇస్తలేదు.. బీజేపోళ్లను నిలదీయండి..

తీవ్ర పదజాలంతో ఎమ్మెల్యే దూషణ

జనగామ: రాష్ట్రానికి రావాల్సిన నిధులను రాకుండా అడ్డుకుంటున్నారు.. అభివృద్ధికి సహకరించడం లేదు.. బీజేపోళ్లను ఊళ్లలోకి రానివ్వకండి.. వస్తే నిలదీయండి అంటూ జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి పరుష పదజాలం వాడారు. శనివారం జనగామ మండలం గానుగుపహాడ్‌లో బీటీ రోడ్డు పనులను ప్రారంభించి తిరిగి వెళ్తున్న ఎమ్మెల్యే వద్దకు పలువురు గ్రామస్తులు వచ్చి వ్యవసాయ పొలాలకు రోడ్డు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. అవి నా దృష్టిలో ఉన్నాయి.. రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ఒకొక్కటిగా చేసుకుంటూ వెళ్తున్నామని పేర్కొన్న ఎమ్మెల్యే.. తెలంగాణ నుంచి ట్యాక్స్‌ల రూపంలో కోట్ల రూపాయలు తీసుకుంటున్న కేంద్ర సర్కారు.. రాష్ట్ర అభివృద్ధికి పైసా ఇవ్వడం లేదు.. బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఊరిలోకి వస్తే నిలదీయండి అంటూ పరుష పదజాలం ఉపయోగించారు. ఈ విషయమై ఎమ్మెల్యే ముత్తిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ నిధులతోనే అభివృద్ధి చేస్తున్నాము.. కేంద్రం డబ్బులు ఇవ్వకుండా గ్రామాలకు వెళ్లిన సమయంలో తమనే విమర్శిస్తున్నారు.. ప్రజల ఆవేదనను తట్టుకోలేక నిలదీయాలని చెప్పినట్లు పేర్కొన్నారు.

సమస్యలపై సభ్యుల గళం

- తాగునీరు, విద్యుత్ ఇబ్బందుల ఏకరువు
- రేషన్ బియ్యం 'దందా'పై సీరియస్
- వాడీ వేడిగా జెడ్పీ సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న జెడ్పీటీసీ వంశీధర్‌రెడ్డి

జనగామ: 'తాగునీటి సరఫరా సక్రమంగా లేదు.. 'మిషన్ భగీరథ' నీటి ట్యాంకుల నిర్వహణ అధ్వానంగా ఉంది.. వ్యవసాయానికి విద్యుత్ మూడోలైన విషయమై అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు.. పేదలకు పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలుతున్నాయి'.. అంటూ సభ్యులు సమస్యలను ఏకరువుపెట్టారు. జెడ్పీ కార్యాలయంలో జిల్లా పరిషత్ చైర్మన్ సంపత్‌రెడ్డి అధ్యక్షతన శనివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో సభ్యులు సమస్యలపై గళమెత్తారు. సమావేశానికి జనగామ, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, తాటికొండ రాజయ్య, కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ హాజరయ్యారు.

ఎవరేమన్నారంటే..

లింగాలఘణపురంలో ప్రతి ఇంటికీ మిషన్ భగీరథ కుళాయిలు బిగించి నీటి సరఫరా సక్రమంగా జరిగేలా చూడాలని జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి, ఎంపీపీ చిట్ల జయశ్రీఉపేందర్‌రెడ్డి అన్నారు. ప్రజలు ఫిల్టర్ వాటర్ కొనుగోలు చేస్తున్నారని, భగీరథ నీటిపై ప్రజల్లో అవగాహన పెంచాలని జఫర్‌గఢ్ జెడ్పీటీసీ బేబీ కోరారు. ట్యాప్‌లు, ఇతర పైపులైన్లు మరమ్మతుకు వచ్చినా పట్టించుకోవడంలేదని, ట్యాంకులను శుభ్రం చేయడంలో పర్యవేక్షణ కరువైయిందని స్టేషన్‌ఘన్‌పూర్ జెడ్పీటీసీ మారపాక రవి మండిపడ్డారు. వ్యవసాయ బావుల వద్ద మూడో విద్యుత్ లైన్ విషయంలో ఎన్పీడీసీఎల్ అధికారులు పట్టించుకోవడం లేదని, విద్యుత్ తీగలు కిందకు వేలాడి ప్రమాదకరంగా ఉన్నాయని నర్మెట ఎంపీపీ గోవర్దన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నాటు వేసిన కొద్దిరోజులకే వరి పంట ఎండిపోతోందని, వ్యవసాయ శాఖ అధ్యయనం చేసి రైతులకు నష్టం జరగకుండా చూడాలని, వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తరిగొప్పుల జెడ్పీటీసీ పద్మజా వెంకటరమణారెడ్డి కోరారు. దరఖాస్తు చేసుకున్న రైతులందరికీ 'రైతుబంధు' ద్వారా పెట్టుబడి సాయం అందించాలని రఘునాథపల్లి ఎంపీపీ వరలక్ష్మి సూచించారు. దళారులు రేషన్ బియ్యాన్ని లబ్ధిదారుల వద్ద కిలో రూ.6 లెక్కన కొనుగోలు చేసి బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారని, దీనిపై సీరియస్ యాక్షన్ తీసుకోవాలని నర్మెట జెడ్పీటీసీ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. దీనిపై సంబంధిత అధికారి రోజారాణి స్పందిస్తూ బియ్యంతో పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేయడంతోపాటు అమ్మిన వారు తెలిస్తే కార్డు సైతం రద్దు చేసేందుకు వెనుకాడబోమని అన్నారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్‌రాజు మాట్లాడుతూ.. జిల్లాకు మంజూరైన మెడికల్ కళాశాల నూతన భవన నిర్మాణం పూర్తయ్యే వరకు ధర్మకంచ జిల్లా కార్యాలయాల సముదాయంతో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం వినియోగించుకోవడానికి పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. కళాశాలకు 100 మెడికల్ సీట్ల సామర్థ్యం ఉన్నప్పటికీ 200లకు పెంచుకునే అవకాశం ఉందన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ వసంత, జెడ్పీటీసీ, ఎంపీపీ, అన్ని శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి, పక్కన ఘన్‌పూర్ ఎమ్మెల్యే, కలెక్టర్, అధికారులు



రైతులను ధనవంతులు చేయడమే కేసీఆర్ లక్ష్యం: ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

రైతులను ధనవంతులుగా చేయడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ ఆయిల్‌పాం సాగును ప్రోత్సహిస్తున్నారని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. భవిష్యత్ ఆయిల్ కొరతను దృష్టిలో ఉంచుకుని తెలంగాణలో ఆయిల్‌పాం సాగుకు శ్రీకారం చుట్టారని, నీటి వసతి ఉన్న రైతులంతా ముందుకు రావాలని కోరారు. ఐదెకరాల్లో సాగు చేస్తే నాలుగేళ్ల తర్వాత ఏటా రూ.5లక్షల ఆదాయం వస్తుందని అన్నారు. సీఎం కేసీఆర్.. నదీ జలాలను మళ్లించి వ్యవసాయానికి దన్నుగా నిలిచారని, తాగునీటి కష్టాలు తీర్చేందుకు మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. 75 ఏళ్లలో జిల్లాలో 102 ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మిస్తే.. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన ఎనిమిదేళ్లలో 350 ట్యాంకుల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. భగీరథ నీటిని ప్రతి ఒక్కరూ తాగేలా అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. శుద్ధి చేసిన నీరు తాగాలని ప్రజలకు చెబుతుండగా.. సమావేశంలో బాటిల్ నీరు ఇవ్వడం ఏమిటని చురకలంటించారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే రాజయ్య మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు మరింత చేరువయ్యేలా చూడాలని ప్రజాప్రతినిధులను కోరారు. గురుకులాలతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య అందించేందుకు సర్కారు కృషి చేస్తున్నదని తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమంలో జిల్లా ముందంజ :కలెక్టర్

ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో జిల్లా ముందు వరుసలో ఉందని కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య అన్నారు. పథకాలు ప్రజలకు చేరేలా చూడడంలో అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారం మరువలేనిదని చెప్పారు. కంటి వెలుగు, వైద్య ఆరోగ్య సేవలు, తదితర వాటిని పక్కా ప్రణాళికతో అమలు చేస్తున్నట్లు వివరించారు.

విద్యకు పది శాతం నిధులు కేటాయించాలి

- వైద్యానికి 6 శాతం కేటాయింపులుండాలి
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి


మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

కేయూ క్యాంపస్: కేంద్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి బడ్జెట్‌లో నిధుల కోత పెడుతుందని, రాబోయే బడ్జెట్‌లో విద్యకు 10శాతం నిధులు, వైద్యానికి 6 శాతం నిధులు కేటాయించాలని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, పౌర స్పందన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కాకతీయ యూనివర్సిటీ కో ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాలలో పౌర స్పందన వేదిక ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లుగా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యా, వైద్యానికి నిధులు తగ్గిస్తుందన్నారు. గత బడ్జెట్‌లో విద్యకు కేవలం 2.64శాతం నిధులు, ఆయుష్మాన్ భారత్‌కు 2.1శాతం నిధులు మాత్రమే కేటాయించారని మండిపడ్డారు. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులు ప్రవేశపెట్టి విద్యార్థులపై ఫీజుల భారం మోపుతున్నారని ఆరోపించారు. ఆదివారం వరకు సంతకాలు సేకరించి 23న ప్రధానమంత్రికి కొరియర్ ద్వారా పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ శ్రీధరకుమార్‌లోథ్, గడ్డం కృష్ణ, ఆర్‌డీ ప్రసాద్, అనిల్‌కుమార్, మధుర్‌రావు, బ్రహ్మయ్య, రాజేశ్వరి, స్వప్న, వందన, వాణి, రమేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో సర్కార్ జాప్యం

రాష్ట్రంలోని ఒప్పంద అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని ప్రతీ అసెంబ్లీ సమావేశాల్లోనూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నానని, అయినా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. శనివారం హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టు అధ్యాపకులు ఎమ్మెల్సీని కలిశారు. 15–20 ఏళ్లుగా విశ్వవిద్యాలయంలో కాంట్రాక్టు అధ్యాపకులుగా పని చేస్తున్నామని వేతనం 30 శాతం పెంచాలని, కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డును ఎత్తివేయాలని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం నర్సిరెడ్డి మాట్లాడుతూ కామన్ రిక్రూట్‌మంట్ బోర్డును గవర్నర్ ఇప్పటి వరకు ఆమోదించలేదన్నారు. సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ప్రిన్సిపాల్ బన్న అయిలయ్య, ఒప్పంద అధ్యాపకుల సంఘం బాధ్యులు డాక్టర్ అంజన్‌రావు, డాక్టర్ కరుణాకర్‌రావు, డాక్టర్ శ్రీధర్ కుమార్‌లోథ్, డాక్టర్ ఫిరోజ్, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

కళలతో సమాజ చైతన్యం

- ప్రముఖ నృత్యకారిణి మల్లికా సారాభాయ్

హన్మకొండ: నాట్యం కేవలం కళే కాదని సమాజాన్ని చైతన్యం చేసే సాధనమని ప్రముఖ భారత నృత్యకారిణి, పద్మభూషన్ మల్లికా సారాభాయ్ అన్నారు. శనివారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కళలకు రాజకీయం ఆపాదించడం ఎంత వరకు సమంజసమని, భక్తి ఆరాధనతో చేసే ఉత్సవాలను రామప్పలో నిర్వహించకుండా అభ్యంతరాలు చెప్పడం సరి కాదన్నారు. రామప్పలో ఉత్సవాలు నిర్వహించి శివుడికి ప్రీతిపాత్రమైన నృత్య ప్రదర్శన ఇవ్వాలని అనుకున్నానని, అక్కడ నిర్వహిస్తే ఎంతో సంతోషించే దానినని, రాజకీయాలు ముడిపెట్టి అనుమతివ్వకపోవడం బాధాకరమన్నారు. దీంతె వరంగల్‌లో ఉత్సవాల నిర్వహణకు కాకతీయ హెరిటేజ్ ట్రస్టు ఏర్పాట్లు చేసిందన్నారు. కాకతీయ హెరిటేజ్ ట్రస్టు ట్రస్టీ బి.వి.పాపారావు మాట్లాడుతూ రాజకీయంగా విభిన్న అభిప్రాయాలు ఉండొచ్చు.. రామప్పకు భక్తి భావంతో వెళ్తాం.. అయితే దానిని రాజకీయంగా చూడడం సరి కాదన్నారు. తాము 14 ఏళ్లు కష్టపడి రామప్పకు యునెస్కో గుర్తింపు సాధించామన్నారు. రామప్ప కేంద్ర పురావస్తు శాఖ ఆధీనంలో ఉన్నందునే రాజకీయ కోణంలో మల్లికా సారాభాయ్ ఫెస్టివల్‌కు అనుమతి ఇవ్వలేదన్నారు. ఇక్కడ కేసీఆర్ సీఎంగా ఉన్నారని.. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిని ఇతరులకు ఇవ్వబోమని ఆయన అనడం లేదుగా అన్నారు. రాజకీయ ఇబ్బందులు వస్తాయనే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రామప్పలో ఉత్సవాల నిర్వహణకు అనుమతి ఇవ్వలేదని ఆరోపించారు. రాష్ట్రంలోని వారసత్వ కట్టడాలను రాష్ట్ర పరిధిలోని తీసుకొచ్చేందుకు పోరాడుతామన్నారు.

కూలిన కలల సౌధం

బతుకుపోరులో ప్రాణాలు కోల్పోయిన యువకులు

- కన్నీటి పర్యంతమవుతున్న కుటుంబాలు
- స్వస్థలాలకు మృతదేహాలు
- అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు


రాము మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు


కల్యాణ్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు

వారంతా 20 – 35 ఏళ్ల మధ్య వయసున్న యువకులు.. పనిచేస్తేనే బతుకు బండిని లాగే నిరుపేద కుటుంబాలు.. పొట్టకూటి కోసం ఫొటోగ్రఫీని వృత్తిగా ఎంచుకుని వృత్తిలో ఇప్పుడిప్పుడే రాణిస్తున్నారు. ఇంతలోనే విధి వక్రీకరించి వారి కలల సౌధాన్ని కూల్చివేసింది. రోడ్డు ప్రమాద రూపంలో కుటుంబాలను వీధి పాలు చేసింది. చిన్న వయసులోనే కొడుకులు దూరమైన తల్లిదండ్రులు, భర్తలను కోల్పోయిన యువతుల ఆర్తనాదాలు ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టిస్తున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం కోటిలింగాల సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన నలుగురిని బలి తీసుకోగా, మరొకరు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈమేరకు శనివారం తెల్లవారుజామునే ఇల్లెందు ఆస్పత్రికి చేరుకున్న వారి కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. పోస్టుమార్టం అనంతరం నలుగురి మృతదేహాలను స్వస్థలాలకు తీసుకురాగా కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు తరలివచ్చి కడసారి చూశారు.

– ఇల్లెందు రూరల్/నర్సంపేట రూరల్/కమలాపూర్

ప్రేమించి పెళ్లి చేసుకున్న నెలకే..

హనుమకొండ జిల్లా కమలాపూర్‌కు చెందిన భాషబత్తిని శ్రీనివాస్– రాజమణి దంపతుల కుమారుడు అరవింద్ (21) ఇంటర్ వరకు చదువుకున్నాడు. తల్లిదండ్రులు నాలుగేళ్లుగా హైదరాబాద్‌లో ఉంటున్నారు. ప్రేమించిన యువతిని పెద్దల అంగీకారంతో గత డిసెంబర్ 17న అరవింద్ పెళ్లి చేసుకున్నాడు. జీవితంలో స్థిరపడాలనే ఆకాంక్షతో ఫొటోగ్రఫీ నేర్చుకోవాలని భావించి హనుమకొండలో నివాసం ఉంటున్నాడు. మిత్రులతో కలిసి ఫొటోషూట్‌కు వెళ్తుండగా రోడ్డు ప్రమాదం మింగేసింది. ఒక్కగానొక్క కుమారుడిని గారాబంగా పెంచామని, కోరుకున్న యువతితో పెళ్లి చేయగా.. ఇంతలోనే ఈ ఘోరం జరిగిందని తల్లిదండ్రులు విలపించిన తీరు కలచివేసింది. ఇక వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన కొంపెల్లి రాంబాబు– జయల ఏకైక కుమారుడు శివకోటి (31). ఆరేళ్ల క్రితం మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం సీతానాగారం గ్రామానికి చెందిన కళ్యాణిని ప్రేమ వివాహం చేసుకోగా ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఫొటోగ్రఫీలో మెరుగైన జీవనం కోసం వరంగల్‌కు మకాం మార్చాడు. అద్దె ఇంట్లో ఉంటున్న ఆయన గతేడాది జాతీయ స్థాయి అవార్డు అందుకున్నాడు. గతేడాదే శివకోటి తల్లి కేన్సర్‌తో మృతి చెందింది. తండ్రి రాంబాబు కరెంట్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వెడ్డింగ్ షూట్ కోసం బయలుదేరి రోడ్డు ప్రమాదంలో శివకోటి ప్రాణాలు కోల్పోగా భార్య, పిల్లలు, తండ్రి దిక్కులేని వారయ్యారు. మృతుల్లో మరో వ్యక్తి హనుమకొండ జిల్లా కమలాపురం గ్రామానికి చెందిన బైరి రాము(32) కూడా ఫొటోగ్రఫీలో మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. పదిహేనేళ్లుగా ఇదే రంగంలో జీవనం సాగిస్తున్న ఆయనకు భార్య రజిని, పాప, బాబు ఉండగా కుటుంబంతో సహా వరంగల్‌లో ఉంటున్నాడు. ఉన్నంతలో జీవనం సాఫీగా సాగుతున్న సమయాన రోడ్డు ప్రమాదం ఆ కుటుంబాన్ని ఛిన్నాభిన్నం చేసింది. రాముకు తల్లిదండ్రులు సదానందం, శ్రీలత ఉన్నారు.

హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న క్రాంతి రణధీర్..

వరంగల్ జిల్లా నర్సంపేట మండలం ద్వారకపేటకు చెందిన అబ్బునాపురం భాస్కర్–రజిత దంపతుల కుమారుడు క్రాంతి రణధీర్(22) తన స్నేహితుడైన కళ్యాణ్ వద్ద కలిసి ఫొటోగ్రఫీ నేర్చుకోవాలని భావించాడు. వృత్తిలో మెళకువలు నేర్చుకునేందుకు శుక్రవారం మిత్రుడితో కలిసి ఫొటోషూట్‌కు వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఆయనను శనివారం ఉదయం ఖమ్మం ఆస్పత్రి నుంచి హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు.

ఆవిరైన చిన్నమ్మ ఆశలు..



వరంగల్ జిల్లా నర్సంపేట మండలం ద్వారకపేటకు చెందిన ఓదెల కళ్యాణ్ (28) చిన్న వయసులోనే తల్లిదండ్రులను కోల్పోయాడు. అదే సమయాన భర్తను కోల్పోయిన కళ్యాణ్ చిన్నమ్మ ఓదెల వనమాల ఆయనను దత్తత తీసుకుంది. ఇంటర్ వరకు చదువుకున్న కళ్యాణ్ ఫొటోగ్రఫీలో మెళకువలు నేర్చుకున్నాడు. 2017లో మహబూబాబాద్ జిల్లా గూడూరుకు చెందిన మౌనికతో వివాహం జరిగింది. పెళ్లయ్యాక వరంగల్ మకాం మార్చాడు. వీరికి రెండేళ్ల కూతురు అంజిత ఉంది. భార్య, కూతురు, చిన్నమ్మతో కలిసి సంతోషంగా ఉంటున్న సమయంలో రోడ్డు ప్రమాదం ఆయనను బలితీసుకుంది. దీంతో పెద్దదిక్కు కోల్పోయిన చిన్నమ్మ వనమాల, భర్త దూరమైన మౌనిక, తండ్రికి ఏమైందో తెలియక చిన్నారి అంజిత రోదిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది.

అంత్యక్రియలు పూర్తి..

ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం ఓదెల కల్యాణ్, భాషబత్తిని అరవింద్, కొంపెల్లి శివకోటి, బైరి రాము మృతదేహాలను స్వస్థలాలకు తీసుకొచ్చారు. బంధువులు, గ్రామస్తులు, స్నేహితులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి కడసారి చూసి కన్నీటి పర్యంతమయ్యారు. అనంతరం కుటుంబ సభ్యుల అశ్రునయనాల మధ్య మృతుల అంత్యక్రియలు పూర్తి చేశారు.




విలపిస్తున్న అరవింద్ కుటుంబ సభ్యులు, భార్యను ఓదారుస్తున్న మృతుడు అరవింద్ తండ్రి శ్రీనివాస్, ఇల్లందు ఆస్పత్రి వద్ద రోదిస్తున్న కళ్యాణ్ కుటుంబీకులు


శివకోటి కుమారులు అఖిల్, అక్షిత్.. కళ్యాణ్ కుమార్తె

అలరించిన నటరాజ వందనం



నృత్య ప్రదర్శన ఇస్తున్న మల్లికా సారాభాయ్ శిష్య బృందం

హన్మకొండ కల్చరల్ : రామప్ప దేవాలయాన్ని ప్రపంచ వారసత్వ సంపదగా యునెస్కో ప్రకటించిన సందర్భంగా కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి హనుమకొండ బాలసముద్రం కుడా మైదానంలో రామప్ప ఫెస్టివల్ వైభవంగా జరిగింది. ముందుగా ప్రభుత్వ చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్, కుడా చైర్మన్ సుందర్‌రాజ్‌యాదవ్, కాకతీయ హెరిటేజ్ ట్రస్టీ బీపీ పాపారావులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వక్తలు మాట్లాడారు. అనంతరం ప్రముఖ కూచిపూడి, భారత నాట్య కళాకారిణి, పద్మభూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ మల్లికా సారాభాయ్ శిష్యబృందంతో ప్రదర్శించిన నటరాజ వందనం నృత్య ప్రదర్శన అలరించింది. ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, కలెక్టర్లు రాజీవ్ గాంధీ హన్మంతు, గోపి, నగర పోలీస్ కమీషనర్ రంగనాథ్, వరంగల్ పూర్వ కలెక్టర్ బీపీ ఆచార్య, ములుగు ఎస్పీ విక్రమ్‌సంగ్రాం, కాకతీయ హెరిటేజ్ ట్రస్టీలు శ్రీధర్‌రావు, పాండురంగారావు, బూర విద్యాసాగర్‌గౌడ్, సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్, సూర్యకిరణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాకారులను సన్మానించారు. కార్యక్రమానికి వాఖ్యాతగా మగ్దూం వ్యవహరించారు. ఉమ్మడి జిల్లాల నుండి అధికసంఖ్యలో నృత్యకళాకారులు, నృత్య గురువులు వారి శిష్యబృందంతో పాల్గొన్నారు. హన్మకొండ సీపీ షకూర్, ఏసీపీ కిరణ్‌కుమార్‌లు బందోబస్తు ఏర్పాటు చేశారు.



నృత్య ప్రదర్శనను తిలకిస్తున్న ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్, కుడా చైర్మన్ సుందర్‌రాజ్, కలెక్టర్లు, పోలీస్ అధికారులు

చికిత్స పొందుతున్న యువరైతు మృతి


శ్రీను (ఫైల్)

మహబూబాబాద్ రూరల్: చికిత్స పొందుతూ యువరైతు మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి శనిగపురం శివారు బోడతండాలో శనివారం జరిగింది. రూరల్ ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన ఇస్లావత్ శ్రీను(35)కు 1.20 గుంటల వ్యవసాయ భూమి ఉంది. ఎకరం భూమిలో మిర్చి, 20 గుంటల్లో భూమిలో వరి సాగు చేశాడు. మిర్చికి అధిక పెట్టుబడి పెట్టినా సరైన దిగుబడి రాలేదు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన శ్రీను ఈ నెల 7న మిర్చి తోట వద్దకు వెళ్లి గడ్డి మందు తాగాడు. గమనించిన శ్రీను భార్య సరోజ చికిత్స నిమిత్తం మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించింది. పరిస్థితి విషమంగా ఉండడంతో రెండు ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి తండ్రి ఇస్లావత్ బోజ్యా ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కొడవలి.. కొట్లాట

- అత్తపై కోడలు.. భార్యపై భర్త దాడి
- ఎడపల్లి, వర్ధన్నపేటలో ఘటనలు


చికిత్స పొందుతున్న మొండమ్మ


చికిత్స పొందుతున్న ఎల్లమ్మ

మహదేవపూర్/వర్ధన్నపేట: కుటుంబ కలహాల నేపథ్యంలో అత్తపై కోడలు, భార్యపై భర్త కొడవలితో దాడి చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం ఎడపల్లి, వరంగల్ జిల్లా వర్ధన్నపేటలో శనివారం ఈ ఘటనలు జరిగాయి. ఎడపల్లికి చెందిన దుర్గం మొండెమ్మ కుమారుడు లక్ష్మయ్యకు 8 ఏళ్ల క్రితం సమతతో వివాహం జరిగింది. శనివారం అత్త, కోడలు మధ్య గొడవ జరిగింది. క్షణికావేశానికి లోలైన సమత అత్త మొండమ్మపై నాటు కొడవలితో దాడి చేసింది. తలకు తీవ్ర గాయాలు కావడంతో మహదేవపూర్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజుకుమార్ తెలిపారు. మరో ఘటనలో భార్యాభర్తల మధ్య వాగ్వాదం భార్యపై కొడవలితో దాడికి దారితీసింది. వర్ధన్నపేటకు చెందిన ఓర్సు రామచంద్రు – ఎల్లమ్మ దంపతులు కొంతకాలంగా తరుచూ గొడవ పడుతున్నారు. రామచంద్రుకు ఎల్లమ్మ మూడో భార్య కాగా, మొదటి భార్య, రెండో భార్య కూతుర్లు, కుమారులతో గొడవలు జరిగేవి. శుక్రవారం రాత్రి ఎల్లమ్మతో రామచంద్రు తీవ్రంగా గొడవ పడ్డాడు. శనివారం తెల్లవారుజామున కొడవలితో కడుపులో పొడిచాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో ఎల్లమ్మ అపస్మారక స్థితికి చేరుకుంది. ఇరుగుపొరుగు వారు గమనించి వరంగల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఎల్లమ్మ పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఎస్సై రామారావు తెలపారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ దుర్మరణం

నల్లబెల్లి: రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ మృతి చెందాడు. ఎస్సై రాజారం కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం అర్వయ్యపల్లి గ్రామానికి చెందిన ఎండి బాబర్(47) నర్సంపేట ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శనివారం రాత్రి విధులు ముగిశాక ద్విచక్రవాహనంపై నర్సంపేట నుంచి స్వగ్రామం వస్తున్నాడు. నల్లబెల్లి క్రాస్ రోడ్డుకు రాగానే ములుగు జిల్లా మల్లంపల్లి నుంచి ఎర్రమట్టి లోడుతో వస్తున్న లారీ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బాబర్ తలకు బలమైన గాయమైంది. సమాచారం అందుకున్న ఎస్సై తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని బాబర్‌ను నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ అతడు మృతి చెందాడు. మృతుడికి భార్య మాదర్‌తో పాటు కుమారుడు యాకుబ్, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. యాకుబ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. కాగా, లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడు.

మెడికల్ మాఫియా లబ్ధికే..

- రాష్ట్రంలో ఆయుష్మాన్ భారత్ అమలు చేయడం లేదు
- కేంద్ర సహాయ మంత్రి బీఎల్ వర్మ


మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి బీఎల్ వర్మ

ఐనవోలు: మెడికల్ మాఫియాకు లబ్ధి చేకూర్చడం కోసమే ఆయుష్మాన్ భారత్ పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయడం లేదని ఈశాన్య ప్రాంత అభివృద్ధి, సహకార శాఖ కేంద్ర సహాయ మంత్రి బీఎల్ వర్మ ఆరోపించారు. లోక్‌సభ ప్రవాస్ యోజనలో భాగంగా హనుమకొండ జిల్లా ఐనవోలు మండలంలో శనివారం ఆయన పర్యటించారు. ముందుగా ఐనవోలులో మల్లికార్జునస్వామి ఆలయాన్ని సందర్శించారు. అనంతరం పున్నేలు క్రాస్ వద్ద గల సత్యం గార్డెన్‌లో బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అధ్యక్షతన ఆయుష్మాన్ భారత్ పథకంపై అవగాహన సదస్సులో కేంద్ర సహాయ మంత్రి మాట్లాడారు. పేదరికంలో పుట్టి పెరిగిన ప్రధాని నరేంద్రమోదీకి పేదవారి కష్టాలు తెలుసునన్నారు. పేదలకు అనారోగ్యం చేస్తే ఆస్తులు అమ్ముకొని రోడ్డుపై పడుతున్న విషయాన్ని గమనించి ఆయుష్మాన్ భారత్ పథకానికి రూప కల్పన చేశారని తెలిపారు. ఈ పథకంలో చేరిన వారికి 1,300 రకాల జబ్బులకు రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యం అందుతుందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణలో కమలం వికసించి డబుల్ ఇంజన్ సర్కార్ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్‌ను గ్రామాల్లో నిలదీయాలని పిలుపునిచ్చారు. అరూరి రమేష్, చల్లా ధర్మారెడ్డి, దాస్యం వినయ్‌భాస్కర్‌లు అవినీతి, అక్రమాలు చేసి వేల ఎకరాల భూములు సంపాదించారని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జల ప్రేమేందర్ రెడ్డి, మాజీ మంత్రి, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయరామారావు, రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మార్తినేని ధర్మారావు, వన్నాల శ్రీరాములు, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, కార్పొరేటర్ జలగం అనిత, నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముత్తిరెడ్డి కేశవరెడ్డి, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

పాసవుతానో.. లేదోనని..

- పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య


హాసిని (ఫైల్)

ఎల్కతుర్తి: పదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని ఇంటి వద్ద ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామంలో శనివారం ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన శలగాని రమేష్ ఆర్‌ఎంపీగా పని చేస్తున్నాడు. వీరికి హాసిని(15) తోపాటు కుమారుడు ఉన్నాడు. హాసిని హసన్‌పర్తి మండలం ఎర్రగట్టు గుట్ట వద్ద గల ఐపీఎస్ స్కూల్లో పదో తరగతి చదువుతుంది. యూనిట్ టెస్టుల్లో మార్కులు తక్కువగా వస్తున్నాయని.. వార్షిక పరీక్షల్లో పాస్ అవుతానో లేదోనని మనస్తాపం చెందిన హాసిని ఇంటి వద్ద రేకుల షెడ్డుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.